# పాఠం

**కాఫీ తాగుతూ** పేపరు చూస్తున్నాను. "ఏవండి!" అంటూ దగ్గరకొచ్చింది నీరజ. ఆ పిలుపులో అనురాగం ఉట్టిపడుతోంది. మా శ్రీమతి అంత ప్రేమగా పిలిచిందంటే ఏదో టెండరు పెడుతోందన్నమాటే. నగనట్రా చేయించమనడానికి అది శ్రావణమాసం కాదు. పట్టు చీర కొనమంటుందేమోనని బెదిరిపోవడానికి దగ్గర్లో పెళ్లిముహూర్తాలేవీ లేవు. కాకపోతే సినిమాకో షికారుకో పదమంటుంది. వాటికైతే పరవాలేదు. గుండె చిక్కబట్టుకుంటూ అర్ధాంగి వంక ఆరాధనగా చూసాను.

"మరేం లేదండి, మీరోమారు అక్కయ్యపాలెం వెళ్ళి అత్తగారెలా వున్నారో చూసిరావాలి. వీలైతే ఆవిణ్ణి ఇక్కడికి తీసుకొచ్చేయండి. ఒక్క మనిషి మనకేం భారంకాదు. మనతోపాటే ఆవిడ."

ఊహించని మాటలు మా శ్రీమతి నోట వెలువడటంతో అవాక్కైపోయాను. ఉన్నట్లుండి అత్తగారిమీద ఈవిడగార్కి ఇంత ప్రేమ ఎలా పుట్టుకొచ్చిందో అర్థం కావడంలేదు. అసలు మా ఆవిడేనా ఈ మాటలంటోందనిపించింది.

"ఏవిటండి అలా అయిపోయారు. నేనేమైనా తప్పుగా మాట్లాడానా" అడిగింది నీరజ నేను బిత్తర పోవడం గమనించి.

"అబ్బే, మంచి ముక్కే అన్నావ్. రేపే వెళతాను. అమ్మని వచ్చేయమంటాను. సరేనా?"

"రేపు కాదు ఇవాళే వెళ్ళండి" అంటూ ఖాళీ చేసిన కాఫీ కప్పు అందుకుని వంటింట్లోకెళ్ళిపోయింది.

అనంతరం మళ్ళీ ఆలోచనలు నా మెదణ్ణి దొలచడం ప్రారంభించాయి. అత్తగారి వల్ల మనకు స్వేచ్ఛ ఉండటం లేదని, ముఖ్యంగా ఆ ముసలావిడ నస భరించలేకుండా ఉన్నానంటూ వేరుకుంపటి పెట్టింది తనే. అద్దెల మీద వచ్చే ఆదాయం ఆవిడ తిండికి సరిపోతుందని జీతమంతా పుచ్చేసుకుని ఇంట్లోక్కావలసినవి అక్కర్లేనివి కొనిపారేసింది.

అయితే శాలరీ అందుకోగానే వెయ్యి రూపాయలు అమ్మకు పంపిస్తున్నాననిగాని వారం వారం వెళ్ళి ఆమె యోగక్షేమాలు కనుక్కొస్తున్నాననిగాని మా ఇల్లాలికి తెలీదు. వేరింటి కాపురం పెట్టిన ఈ సంవత్సర కాలంలో ఒక్కమారు కూడా తల్లిని చూడటానికి వెళ్ళలేదనే అనుకుంటోంది పాపం. కలహించు కుంటూ అత్తాకోడళ్ళు ఒకచోట ఉండే కంటే విడిగా ఉండటమే ఉత్తమమని భావించి ఆమె కోరికను అంగీకరించానే తప్ప అమ్మంటే ఇష్టంలేక కాదు. ఆవిడ మీద ప్రేమలేక కాదు. నాకు మాత్రం ఎవరున్నారు? తండ్రి చిన్నతనంలోనే పోయాడు. అక్క, తమ్ముడు అనిపిలుచుకునేందుకు వెనకా ముందు ఎవ్వరూ లేరు.

అమ్మను అపురూపంగా చూసుకోగల గుణవంతురాలను అర్ధాంగిగా పొందాలని ఆశపడ్డాను. అయితే అందుకు భిన్నంగా జరిగినందుకు బాధపడ్డాను. బింకాలకు పోయి

సంసారాన్ని నరకం చేసుకోవడమిష్టంలేక ఆమె మాటకు 'ఊ' కొట్టాను తప్ప ఇష్టాపూర్వకంగా కాదు. ఎందుకో ఈ మధ్య పుట్టింటికి వెళ్ళి వచ్చిందగ్గర నుండి ఆమె అదోలా ఉంటోంది. కారణమేమిటో నా ఊహకు అందడం లేదు. అడిగి తెలుసుకోవాలని పించక ఊరుకున్నాను. ఆలశ్యంగానైనా ఆమెలో పరివర్తన వచ్చినందుకు సంబరపడ్డాను.

అర్ధాంగి ఆదేశానుసారం ఆ సాయంత్రమే అమ్మను తీసుకొద్దామని బయలుదేరాను. అనుకోని విధంగా బస్‌స్టాప్‌లో మా బావమర్ది కనిపించేసరికి పలకరింపుగా నవ్వాను.

"మా చెల్లాయిలో మార్పేమయినా వచ్చిందా?" అడిగాడు భానుమూర్తి దగ్గరకొస్తూ.

"ఉన్నపళంగా నన్నెందుకో మా అమ్మని తీసుకొచ్చేయమని ఆర్డరేసింది. ఆ పనిమీదే బయల్దేరాను. ఇందులో నీ పాత్రగాని ఏమైనా ఉందా మహాశయా" అని అడిగాను వాడి ప్రశ్నకు విస్తుపోతూ.

"చెబుతా పద. అలా పార్లర్‌లో నిలబడి మాట్లాడుకుందాం" అన్నాడు మూర్తి.

"బస్సు" అన్నాను ఆర్థోక్తిగా.

"ఇప్పుడప్పుడే రాదులే. ఆ రూట్లో ఇప్పుడే రెండు బస్సులెళ్ళాయి."

వాడి మాటప్రకారం దగ్గర్లో వున్న టీస్టాల్లో దూరాం. టీ తాగుతూ చెప్పడం మొదలుపెట్టాడు భానుమూర్తి. శ్రోతనయ్యాన్నేను.

★ ★ ★

తల్లికి ఒంట్లో బాగోలేదని వర్తమానం అందుకుని పుట్టింటికెళ్ళింది నీరజ.

ఇంట్లో వదిన పిల్లలు ఎవ్వరూ లేరు.

గదిలో మంచం మీద మూలుగుతూ కనిపించింది అమ్మ.

ఒంటరిగా వున్న తల్లిని చూడగానే బావురుమంది నీరజ మనసు.

"వచ్చావా తల్లీ, నిన్ను చూస్తానో చూడలేనో అనుకున్నాను" అంటూ కూతుర్ని దగ్గరగా తీసుకుంది శారదాదేవి.

"అన్నయ్యా వదిన ఏరమ్మా? ఇంట్లో ఎవ్వరూ కనిపించరేంటి?"

గద్గదమైంది నీరజ గొంతు.

"ఏం చెప్పమంటావమ్మా, నేను వాళ్ల సుఖానికి అడ్డుగోడగా ఉన్నానని వేరుపడ్డారు. కంచరపాలెంలో కాపురం పెట్టి రెండు నెలలవుతోంది. పోన్లే ఎక్కడో అక్కడ వాళ్ళు సుఖంగా వుంటే అంతే చాలు."

తల్లి దీనావస్థను చూడగానే నీరజ కళ్ళ వెంబడి నీళ్ళు చిప్పిల్లాయి.

"వదిన మాటసరే, అన్నయ్య బుద్ధి ఏమైంది? ఉన్నట్లుండి ఎందుకిలా మారిపోయాడు? నిన్నీ వయసులో ఒంటరిగా వదిలేస్తే ఎవరు చూస్తారనుకున్నాడు?" అంటూ అన్నదమ్ముడి మీద విరుచుకు పడింది.

"ఊరుకో తల్లీ, అద్దాలలో ఉన్నంతసేపే బిడ్డలన్నారు. అన్నీ తెలిసే వాళ్ళేదో ఉద్ధరిస్తారన్న భ్రమలో పిల్లల మీద మమకారం పెంచుకుంటారు తల్లిదండ్రులు. అవన్నీ ఇప్పుడెందుకు గాని కాస్త కాఫీ కలిపి నోట్లో పొయ్యమ్మా. నిన్నటి నుండి పచ్చి మంచినీళ్ళు ముట్టుకోకపోవడం వల్ల పేగుల్లో నొప్పి పుడుతోంది. జ్వరం మూలాన్న లేచి జావైనా కాచుకోలేకుండా ఉన్నాను."

అత్యంత దైన్యంగా వున్న శారదాదేవి మాటలకు నీరజ హృదయం ద్రవించుకుపోయింది. కాఫీ కలుపుదామని పరుగున వంటింట్లో కెళ్ళింది. చూస్తే పాలు లేవు. పంచదార నిండుకుంది. ఇలా లాభం లేదనుకుని ఫ్లాస్కు పుచ్చుకుని హోటల్ కెళ్ళింది. రెండు కప్పులు కాఫీతో పాటు పళ్ళు, బ్రెడ్లు కొనుక్కొచ్చింది.

ఆ రాత్రంతా దగ్గరుండి తల్లికి ఉపచర్యలు చేసేసరికి కాస్త తేరుకుంది శారదాదేవి.

"నువ్వు ఒక్కర్తివీ ఇక్కడ ఏం ఉంటావమ్మా? నాతో వచ్చేయ్. నిన్ను కంటికి రెప్పలా చూసుకుంటాను" అన్నది నీరజ.

"వద్దమ్మా నేను రాలేను. తల్లి కూతురి దగ్గరుంటే లోకం హర్షించదు. నా పాట్లేవో నేను పడతాను. నువ్వెళ్ళు తల్లీ" అంది శారదాదేవి.

తల్లిని ఒంటరిగా విడిచిపెట్టి వెళ్ళలేక చీవాట్లు పెట్టయినా సరే అన్నయ్యను లాక్కొద్దామని కంచరపాలెం వెళ్ళింది నీరజ.

చెల్లాయిని చూసి తప్పుచేసినవాడిలా మొహం చాటేసాడు భానుమూర్తి.

"అమ్మని వంటరిగా వదిలేసి మీమానం మీరు వచ్చేయడం ఏం బావుందన్నయ్యా. ఈ వయసులో ఆమెను ఎవరు చూస్తారనుకుంటున్నావ్" అంటూ నిలదీసింది నీరజ. మాట్లాడలేదు భానుమూర్తి. "చెప్పన్నయ్యా, నాప్రశ్నకు బదులు చెప్పు. అమ్మకు మొన్నటి నుండి విడవకుండా జ్వరం కాస్తోంది. నేను వెళ్లి జావకాచి వచ్చాను. ఆమెకు ఎవరి దక్షతలేదు. నేను తీసుకెళతానంటే నాతో రావడంలేదు. కొడుకే ఉద్ధరించాలంటుంది. ఇటు కొడుకు చూడక అటు కూతురు దగ్గరకు రాకపోతే ఆమె ఏమైపోవాలి? నీలాంటి కొడుకు..."

"ఆగు... ఊరుకున్నకొద్దీ రెచ్చిపోతున్నావ్. నువ్వన్న నీతి సూత్రం నీకు వర్తించదా?" మాట మధ్యలో అందుకున్నాడు భానుమూర్తి.

"నా సంగతి వేరు. మా అత్తగారికి నా పొడగిట్టదు. అస్తమాను ఏదో వంక పెట్టి నన్ను దెప్పిపొడుస్తూనే ఉంటుంది. అంతే కాదు. కొడుకు కోడలు కలిసుంటే చూడలేదు. కాని అమ్మ అలా కాదు. నిన్నుగాని, వదిననుగాని ఏనాడూ పల్లెత్తు ముక్క అన్న పాపాన పోలేదు. మీ స్వేచ్ఛకు ఎన్నడూ అడ్డు తగల్లేదు. అటువంటి తల్లిని..."

"చూడు నీరజా, అమ్మమీద నీకే కాదు నాకూ ప్రేమ ఉంది. ఏ కొడుకూ తల్లినుండి వేరు పడాలని కోరుకోడు. ఎటొచ్చి పెళ్ళయ్యాకే ఈ సమస్య తలెత్తుతోందంటే అందుకు కారణం అత్తకోడళ్ళ మధ్య సఖ్యత లోపించడమే. కోడలు అత్తను అభిమానంగా చూసుకుంటే అత్త ఆ పిల్లని కన్నకూతురికంటే మిన్నగా భావిస్తుంది. దీనినే థియరీ ఆఫ్ రెసిప్రోసిటీ అంటారు. ఈ

పరస్పరత సిద్ధాంతాన్ని ఏ శాస్త్రవేత్త ప్రతిపాదించ లేదు. కేవలం కామన్‌సెన్సు లోంచి పుట్టింది. ఇచ్చి పుచ్చుకునే ధోరణిని విస్మరించి అపోహలతో కలహించుకుంటూ అత్తాకోడళ్ళు వేరు పడుతున్నారు. ఫలితంగా ఎన్నో అనర్థాలకు కారణ భూతులవుతున్నారు." ఎంతో ఆవేశంగా అన్నాడు భానుమూర్తి.

★ ★ ★

అక్కయిపాలెం సిటీ వచ్చింది.

"బయల్దేరు" అన్నాడు భానుమూర్తి. ఏమో అనుకున్నాను మా బావమర్ది ఘటికుడే. నా భార్యకి బ్రెయిన్‌వాష్ చెయ్యడానికి ఎంత చక్కగా నాటకం ఆడాడు?! ఎన్నటికీ మారదనుకున్న నీరజలో పరివర్తన తీసుకొచ్చిన భానుమూర్తికి ఎలా కృతజ్ఞతలు తెలియజేసుకోవాలో తెలియక మనసులోనే అతడిని అభినందిస్తూ బస్సెక్కాను.

**(ఫిబ్రవరి 2001, ఆంధ్రభూమి మంత్లీ)**